సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 18 । మార్చి । 2023



ఇక 'స్మార్ట్' రీడింగ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మార్చి నుంచి ప్రయోగాత్మకంగా స్మార్ట్ ఫోన్ ద్వారా రీడింగ్ తీసే విధానానికి శ్రీకారం చుట్టారు.

IIలో ▸



శ్రీవారి కొండపై అభివృద్ధి పరవళ్లు

శ్రీవారి కొండపై భక్తులకు మరిన్ని సౌకర్యాల కోసం అనివేటి మండప విస్తరణ, శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టారు.

IIలో ▸

మామిడికి తెగుళ్ల ముప్పు



మామిడికి ప్రసిద్ధిగాంచిన నూజివీడు ప్రాంతంలో అకాల వర్షాల వల్ల తెగుళ్లు సోకే అవకాశముందని మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించారు.

IIలో

న్యూస్‌రీల్

'పది' ఉత్తీర్ణతలో ప్రథమ స్థానం సాధించాలి : కలెక్టర్



భీమవరం బీవీరాజు కళాశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిబద్ధతతో నిర్వహించి జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా అధికారులు పనిచేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం భీమవరం బీవీ రాజు కళాశాల ఆడిటోరియంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రశాంతంగా ఉండేలా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. పరీక్షలంటే భయం లేకుండా విద్యార్థులను తయారుచేయాలన్నారు. పరీక్షలు వచ్చేనెల 3 నుంచి 18 వరకు 121 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పి.శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి పొగాకు వేలం ప్రారంభం



జీఎల్‌కె ప్రసాద్, పొగాకు బోర్డు ఆర్ఎం

బుట్టాయగూడెం: ఈ నెల 23 నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 5 వేలం కేంద్రాల్లో పొగాకు బేళ్ల వేలం ప్రారంభం కానున్నట్లు పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కె ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ వేలం కేంద్రాలకు బేళ్లు తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా 150 కేజీల లోపు ఉండేలా వేలం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ప్రస్తుతం బేళ్ల తూకానికి సంబంధించి కొత్త కాటాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. కొత్త విధానంలో ట్రాలీతో సహా బేళ్లను తోస్తారని చెప్పారు. గతంలో బేళ్లను ముందుగా తూసిన తర్వాత 150 కేజీలకు మించి ఉంటే కట్ చేసి ట్రాలీపై తీసుకువెళ్ళేవారని అన్నారు. ఇప్పుడు అలా కాకుండా ట్రాలీతో సహా తూస్తారని, తప్పనిసరిగా 150 కేజీల లోపు తీసుకురావడం వల్ల సమయం కలిసి వస్తుందని అన్నారు. కొత్తగా వచ్చిన కాటాను గత ఏడాది జంగారెడ్డిగూడెం-2 వేలం కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ఏడాది జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డి.మహేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో కొత్త వైరస్ వ్యాప్తి ఉండటంతో ప్రతీ ఒక్కరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఇళ్ళల్లో పాటించేలా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అవశ్యమన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమన్నారు. అనంతరం జగన్నాథపురంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి హిమోగ్లోబిన్ పరీక్షలపై ప్రధానోపాధ్యాయుడికి అవగాహన కల్పించారు. ఆయన వెంట మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శైలజ, మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు, ఆరోగ్య విస్తరణాధికారులు కె.కృపావరం, హరి, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు(మెట్రో): పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న స్థాయీ సంఘ కమిటీ సమావేశాలు ఈ నెల 18న శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈవో చెప్పారు.

టీడీపీకి ఘోర పరాభవం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఓట్లు కూడా పడని వైనం
- ముఖ్యనేతలతో పాటు జనసేన ఝలక్
- రెండు పార్టీలకు కలిపి 192కు గాను దక్కినవి 122 ఓట్లే..
- జయమంగళ చేరికతో వైఎస్సార్‌సీపీకి కొల్లేరులో అదనపు బలం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ మంత్రి ఆళ్ల నాని, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ (ఫైల్)



ఎమ్మెల్సీలుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలో టీడీపీకి గట్టి దెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీస సంఖ్యాబలం లేనప్పటికీ పోటీ చేసి ఉన్న పరువు పోగొట్టుకుంది. ఏకగ్రీవమైతే చంద్రబాబు కోప్పడతారని, చివరి నిమిషంలో నలుగురితో నామినేషన్లు వేయించి వారిలో ఒకరిని అభ్యర్థిగా ప్రకటించి జనసేన అంతర్గత మద్దతుతో ఎమ్మెల్సీ పోరులో హడావుడి చేశారు. తీరా పోలింగ్ జరిగి కౌంటింగ్ పూర్తయ్యాక చూస్తే టీడీపీకి సొంత ఓట్లు కూడా పడలేదు. ముందు వరకు హడావుడి చేసిన నేతలు కౌంటింగ్ ముగిశాక ముఖం చాటేశారు. దీంతో జిల్లాలో తెలుగుదేశం పార్టీ వాస్తవ బలం మరోసారి బహిర్గతమైంది.

సంఖ్యాబలం లేకున్నా బరిలోకి..

స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో తెలుగుదేశం పార్టీకి కోలుకోలేని దెబ్బతగిలింది. పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్లు కూడా పార్టీ అభ్యర్థికి వేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. పార్టీలో బీసీలను నిర్లక్ష్యం చేస్తుండటంతో వారు ఆ పార్టీని వీడుతుండటం, ఇలా వరుస పరిణామాలతో టీడీపీ గందరగోళంలో పడింది. స్థానిక సంస్థల కోటాలో జిల్లాలో ఖాళీకానున్న రెండు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. గతంలో పూర్తి సంఖ్యా బలం టీడీపీకి ఉండటంతో రెండు స్థానాలు టీడీపీ గెలిచింది. ఈ సారి 85 శాతంపైనే స్థానిక సంస్థలు వైఎస్సార్‌సీపీకి దక్కడంతో ఆ పార్టీ సునాయాసంగా ఆ రెండింటిని గెలవగలదు. తెలుగుదేశం పార్టీకి 125 స్థానాలు, మిత్రపక్షమైన జనసేనకు 70 ఓట్లు ఉన్నాయి. మొదటి ప్రాధాన్యతలో గెలవాలంటే సగటున 340 పైచిలుకు ఓట్లు అవసరం. సామాజిక సమీకరణాలు లెక్క వేసుకుని ఉన్న 195 ఓట్లకు అదనంగా మరికొన్ని ఓట్లు పడతాయనే ఆలోచనతో టీడీపీ అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌ను బరిలో నిలిపారు. అంతటితో ఆగకుండా అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్‌చార్జులే ప్రచారం నిర్వహించి మరోవైపు సామాజిక కోణంలోనూ ప్రచారం చేశారు. తీరా పోలింగ్ రోజున ఆ పార్టీ క్యాడర్ షాకిచ్చింది.

టీడీపీ ఓట్లు గోవిందా

టీడీపీ, జనసేన కలిపి ఉన్న 195 ఓట్లల్లో 122 ఓట్లే అభ్యర్థికి దక్కాయి. టీడీపీ ఓట్లు నూరు శాతం పోలైనట్లు పార్టీ శ్రేణులే పోలింగ్ రోజున ధ్రువీకరించాయి. కౌంటింగ్ ముగిసిన తరువాత చెల్లుబాటు కాని 25 ఓట్లు టీడీపీవి అని తేలింది. 195 ఓట్లగాను 122 ఓట్లతో టీడీపీ సరిపెట్టుకుంది. సామాజిక కోణంలో కనీసం రెండో ప్రాధాన్యత ఓటుగానైనా దక్కించుకోవాలని తెరచాటు యత్నాలు చేసినా టీడీపీ ఓటర్లే తిప్పికొట్టడం విశేషం.

జయమంగళ చేరికతో మరింత బలం

తెలుగుదేశం పార్టీలో దశాబ్దాలుగా క్రియాశీలకంగా ఉన్న కైకలూరు మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఎన్నికల సమయంలో వెన్నుపోట్లతో ఓటమి పాలయ్యేలా చేసి జయమంగళకు రాజకీయంగా ఫుల్‌స్టాప్ పెట్టడానికి అనేక కుయుక్తులు పన్నారు. కట్ చేస్తే వైఎస్సార్‌సీపీ జయమంగళాన్ని పార్టీలో చేర్చుకుని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో పార్టీ శ్రేణులు షాక్ తిన్నారు. కొల్లేరులో బలమైన నేత కావడం, కొల్లేరు ప్రజల సమస్యలపై పోరాటం చేసే నేతగా గుర్తింపు ఉంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ఆయనను ఈ నెల 23న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించారు. దీనికి సంబంధించి ప్రజాప్రతినిధులకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఇటీవల ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ళ నాని, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావులతో కలిసి వెళ్ళి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఎమ్మెల్సీ బీఫాం అందుకున్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు



జిల్లా అధికారులతో లేఅవుట్లపై సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా జాయింటు కలెక్టర్ ఎం.సూర్యతేజ సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులతో అక్రమ లేఅవుట్లపై అయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి అనేక మంది మోసపోయి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అక్రమ లేఅవుట్‌లు వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. నిబంధనలు ప్రకారం అనుమతి తీసుకోవడంతో పాటు 10 శాతం భూమి ప్రభుత్వానికి ఇవ్వాలని, 33 శాతం రోడ్లు వేయాలన్నారు. అక్రమ లేఅవుట్‌లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అన్ని ప్రాంతాలలో లేఅవుట్‌లు వేయాలంటే అర్బన్ అథారిటీ అనుమతి పొంది వారు అప్రూవ్ చేసిన ప్లాన్ ప్రకారం మాత్రమే వేయాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీవో దాసిరాజు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఎం.చంద్రశేఖర్, పంచాయతీ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైతులంతా సంఘటితం కావాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



యలమంచిలిలో తెల్లదోమ నివారణపై కలెక్టర్ ప్రశాంతికి వివరిస్తున్న శాస్త్రవేత్త చలపతిరావు

యలమంచిలి: వ్యవసాయం లాభసాటి కావాలంటే రైతులంతా సంఘంగా ఏర్పడాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఉద్యాన శాఖ అధికారులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొబ్బరి రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వరి, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను ఆర్థికంగా ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఒక్కో పథకంలో 35 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ ఉందన్నారు. ఈ సబ్సిడీలు పొందాలంటే రైతులు సంఘంగా ఏర్పడితేనే సాధ్యమవుతుందని వివరించారు. ఇక నుంచి ఉద్యాన పంటల్లో ఉన్న పథకాలు, సబ్సిడీ వివరాలను పొలంబడి కార్యక్రమంలో రైతులకు వివరించడంతోపాటు రైతు భరోసా కేంద్రాల వద్ద నోటీసు బోర్డులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అంబాజీపేట కొబ్బరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరి, అరటి, పనస, సీతాఫలం, అలంకార జాతికి చెందిన మొక్కలను ఆశించి నష్టపరుస్తున్న తెల్ల దోమ నివారణకు రైతులంతా కంకణబద్ధులు కావాలని కోరారు. నివారణకు ఎట్టి పరిస్థితిల్లోను క్రిమి సంహారక మందులు పిచికారి చేయవద్దని కోరారు. క్రిమి సంహారక మందులు తెల్లదోమతోపాటు మిత్ర పురుగులను కూడా చంపుతాయని, అప్పుడు తెల్లదోమను అరికట్టడం మరింత కష్టతరమవుతుందన్నారు. తెల్లదోమ నివారణకు పసుపు రంగు ప్లాస్టిక్ బరకాన్ని చెట్టుకు మూడు నుంచి ఐదడుగుల ఎత్తులో కట్టి దానికి ఆముదం రాయడం ద్వారా అరికట్ట వచ్చన్నారు. ఎన్‌కార్సియా గ్వడేలోపే మిత్రపురుగులను తోటలో వదలడం ద్వారా కూడా అరికట్టవచ్చునని చెప్పారు. ఇసారియా మిత్ర శిలీంధ్రం ఉత్పత్తికి రైతులకు అంబాజీపేట కొబ్బరి పరిశోధన సంస్థలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిలీంధ్రంతో తెల్లదోమ నుంచి పంటను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎ.దుర్గేష్, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.అనూష, డాక్టర్ వి.గోవర్ధన్, ఉద్యాన అధికారి ప్రియదర్శిని, నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, తహసీల్దార్ లక్కు నరసింహారావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీకి నిధుల కేటాయింపుపై హర్షం

తాడేపల్లిగూడెం: వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి 2023-24 సంవత్సరానికి రూ.102.04 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినందుకు ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్-నేషనల్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ అక్రిడేషన్ బోర్డు; న్యూఢిల్లీ ద్వారా గ్రేడ్ ఏ గుర్తింపు పొందిందన్నారు. వర్సిటీ విడుదల చేసిన 18 రకాల హైబ్రిడ్‌ల్ని జాతీయ స్థాయిలో సెంట్రల్ వెరైటీ రిలీజ్ కమిటీ నోటిఫై చేసిందన్నారు. రాష్ట్ర వెరైటీ విడుదల కమిటీ ద్వారా పది రకాలు విడుదల చేసిందన్నారు. రైతులకు పంపిణీ చేయడానికి మామిడి, తీపి నారింజ, పులుపు నిమ్మ, కొబ్బరి, జీడిపప్పు, అరటి మొదలైన నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసిందన్నారు. వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, మహానంది ఉద్యాన పరిశోధన స్థానాల నర్సరీలకు హార్టీకల్చర్ బోర్డు స్టార్ రేటింగ్ ఇచ్చిందన్నారు.

సీఎం జగన్‌తో అంబేడ్కర్ కల సాకారం

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఆలయాల చైర్మన్‌లు, పార్టీ నాయకులు

పాలకొల్లు అర్బన్: బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కావాలన్న బీఆర్ అంబేడ్కర్ కల్ని సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయం సాధించిన కవురు శ్రీనివాస్ అన్నారు. ఎంపీటీసీ నుంచి ఎమ్మెల్సీగా తన విజయానికి దోహదపడిన సీఎం జగన్ వెంటే తన ప్రయాణం సాగిస్తానని శ్రీనివాస్ పేర్కొన్నారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం సాధించడానికి ఈ ఎన్నికలు శుభ సూచకమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా నవరత్నాల పథకాలను అమలు చేసిన కారణంగా ప్రతిపక్ష పార్టీలు సైతం తనకు ఓటు వేసి గెలిపించారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీకి బలం లేకపోయినా టీడీపీకి చెందిన వ్యక్తిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిపి కుట్రలు చేసి అక్రమ రాజకీయాలకు తెరలేపారని శ్రీనివాస్ దుయ్యబట్టారు. టీడీపీ, జనసేలకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక ఉమ్మడిగా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారని విమర్శించారు. పాలకొల్లులో ఎమ్మెల్యే రామానాయుడికి ఓటమి రుచి చూపిస్తామని హెచ్చరించారు. తన విజయానికి సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కి వేద ఆశీర్వచనాలు

శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం అర్చకస్వాములు అనిల్‌కుమార్ బృందం శ్రీనివాస్‌కు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఈవో యాళ్ల సూర్యనారాయణ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, శ్రీ అష్టభుజలక్ష్మీనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ గాదె వెంకన్న, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, సత్రాల చైర్మన్‌లు మామిడి వెంకటేశ్వరరావు (బాబు), నంబూరు శ్రీగంగాపవన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు శ్రీనివాస్‌కి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు.

ప్రతిభే అభివృద్ధికి పెట్టుబడి



ఐటీఐలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఉండి: ప్రతి ఒక్కరిలోని ప్రతిభే వారి అభివృద్ధికి పెట్టుబడి అని కేంద్ర స్కిల్ డెలవప్‌మెంట్ తెలుగు రాష్ట్రాల రీజినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం అప్రెంటిషిప్ వర్క్‌షాప్‌లో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఐటీఐ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని పారంభించిన అనంతరం మాట్లాడుతూ వృత్తి విద్యానైపుణ్యం మనకు గౌరవం పెంచుతుందన్నారు. దానికి మరింత పదునుపెడితే ఉన్నతస్థాయిలో నిలిచే అవకాశం ఉందన్నారు. ఐటీఐ చదివిన ప్రతీ విద్యార్థి తప్పకుండా అప్రెంటిస్ చేయాలని అన్నారు. అప్రెంటిస్ చేస్తేనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. ఐటీఐ చదివిన ప్రతీ విద్యార్థికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. దీని కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసామని చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి, శిక్షణాధికారి అప్పారావు, ఆర్‌డీడీ డీ నాగవర్ధన్‌రాజు, ఐటీఐ జిల్లా కన్వీనర్‌లు వీ.శ్రీనివాసరాజు, రజిత, ప్రిన్సిపాల్స్ ఐవీఎస్ఎన్ రాజు, రవి, మోహన్, శివయ్య, ప్రైవేటు ఐటీఐల ప్రతినిధులు, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలతో వరికి నష్టం లేదు

- అనవసరంగా పురుగుమందులు వాడొద్దు
- మానుపుండు ఆశిస్తే టిల్ట్ వాడాలి: వ్యవసాయ అధికారులు



భీమవరంలో ఈనిక దశలో ఉన్న దాళ్వా పంట

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల కురిసే కొద్దిపాటి వర్షాలతో వరి పంటకు ఇబ్బంది ఉండదని వ్యవసాయశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఉపరితల ఆవర్తనంతో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా కొద్దిపాటి వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో పశ్చిమలో 1.12 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 2.36 లక్షల ఎకరాల్లో రైతులు వరినాట్లు వేశారు. ఇంతవరకు వాతావరణం అనుకూలంగా ఉండడంతోపాటు వ్యవసాయ శాఖ నిత్యం పర్యవేక్షణతో వరి పంట ఏపుగా పెరిగింది. కొన్ని చోట్ల మరో 10 రోజుల్లో కోతకు సిద్ధం కానుండగా మిగిలినచోట్ల ఈనిక, చిరుపొట్ట వంటి దశల్లో ఉంది. జిల్లాలో దాళ్వా సీజన్‌లో రైతులు ఎక్కువగా ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 వంటి రకాలు వేయగా.. ప్రస్తుతం ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ పూర్తిచేసి రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు పెట్టారు. పంట ఆశాజనకంగా ఉండడంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్న తరుణంలో వాతావరణలో మార్పులు కారణంగా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. భారీ వర్షాలు కురిస్తే పంటకు తెగుళ్లు ఆశించి దిగుబడులు తగ్గిపోతాయని భయపడుతున్నారు.

మానుపుండుతో ధాన్యం రంగులో మార్పు

కొద్దిపాటి వర్షం వల్ల పంటకు, పైరుకు ఎలాంటి నష్టం ఉండదని, రైతులు ఆందోళనతో విచక్షణారహితంగా పురుగుమందులు పిచికారీ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. అనవసరంగా ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల పెట్టుబడులు పెరగడం తప్ప ప్రయోజనం ఉండదన్నారు. వర్షాలు వల్ల వరికంకుల్లో మానుపుండు తెగులు ఆశించవచ్చునని దానివల్ల ధాన్యంలో కొద్దిపాటి పసుపురంగు చోటుచేసుకోవడం మినహా ఎలాంటి ప్రభావం చూపదని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆక్వాకు ముప్పు

భీమవరం అర్బన్: అల్పపీడనం కారణంగా రొయ్యలు, చేపలు చెరువులకు ముప్పు పొంచిఉంది. రొయ్యలు ప్రస్తుతం సీడ్ దశ నుంచి పట్టుబడికి వచ్చాయి. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై వర్షాలు పడటంతో చలి తీవ్రత ఎక్కువైంది. దీంతో నీరు చల్లబడి రొయ్యలకు విబ్రియో, వైట్ స్పాట్ లాంటి వైరస్‌లు వ్యాప్తి చెందుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులలో పీహెచ్, ఆక్సిజన్, అమ్మోనియా, నైట్రేట్ తదితర వాటిలో హెచ్చుతగ్గులు వచ్చి విషవాయువులు వ్యాపించవచ్చని, ఇది రొయ్య, చేపలపై ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. మరో రెండు రోజులు వాతావరణం ఇలాగే ఉంటే నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉప్పు రైతుకు ఎంత కష్టం !

మొగల్తూరులో మామిడికి వర్షం దెబ్బ



మొగల్తూరులో మామిడిచెట్లకు మందు పిచికారీ



పెదమైనవానిలంకలో ఉప్పుమడుల్లోకి వర్షం

నరసాపురం: అకాల వర్షం తీరప్రాంతంలోని రైతులను ఆందోళనకు గురిచేస్తుంది. మరో 3 రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందనే వాతావరణశాఖ హెచ్చరికలతో మరింత ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి తీరప్రాంతంలో వర్షం ప్రారంభమైంది. సాయంత్రానికి వర్షం తీవ్రత పెరిగింది.

ఆరంభంలోనే ఉప్పు రైతుకు కష్టాలు

తీర ప్రాంత గ్రామాలు తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, మోళ్లపర్రు తదితర 15 గ్రామాల్లో ఈ ఏడాది దాదాపు 1500 ఎకరాల్లో ఉప్పు సాగు ప్రారంభించారు. సీజన్ కావడంతో ఇప్పుడిప్పుడే మడులు కడుతున్నారు. ఎండలు బాగా కాస్తే ఇక మడుల్లో ఉప్పు ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ దశలో ఎన్నడూలేని విధంగా మార్చి నెలలో అకాల వర్షం ఉప్పురైతుల కష్టాన్ని నీటిపాలు చేసింది.

మామిడికి దెబ్బ

మొగల్తూరు మామిడికి అకాల వర్షాలు మరింత నష్టం కలిగించాయి. అసలే ఈ ఏడాది పూత సరిగా లేకపోవడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మందులు రెండు దఫాలుగా పిచికారి చేసినా పూత నిలబడలేదు. మళ్లీ ఇప్పుడిప్పుడే పూత నిలబడుతుంది. ఈ దశలో భారీ వర్షం, ఈదురు గాలులతో పూత రాలిపోతుందని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


దివ్య మృతదేహం

సాక్షి, భీమవరం: పట్టణంలోని మారుతీ నగర్‌లో ఓ వివాహిత ఉరి వేసుకుని అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్సై ఎస్.సత్యసాయి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురానికి చెందిన తాటి దివ్య (22)కు ఏలూరు నగరం కుస్తీల దొడ్డు, ప్రేమాలయానికి చెందిన వెంకట శ్రీకాంత్‌తో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. శ్రీకాంత్ భీమవరంలోని ఓ ప్రైవేటు విద్యా సంస్థలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వీరు ఐదు నెలల క్రితం మారుతీ నగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం శ్రీకాంత్ కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేసరికి దివ్య ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. స్థానికులు సహాయంతో ఆమెను కిందకి దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. విషయాన్ని మృతురాలి తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యసాయి తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ యు.రవి ప్రకాష్, డీఎస్పీ బండారు త్రినాథ్ పరిశీలించారు.

ఇక స్మార్ట్ రీడింగ్

- స్మార్ట్ ఫోన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్
- బ్లూటూత్ ప్రింటర్ ద్వారా విద్యుత్ బిల్లులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు
- జూన్ నుంచి పూర్తిస్థాయి అమలుకు చర్యలు

తణుకు: సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ విధానాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ తన పరిధిలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మార్చి నుంచి ప్రయోగాత్మకంగా స్మార్ట్ ఫోన్ ద్వారా విద్యుత్ మీటర్ రీడింగ్ తీసే విధానానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఐఆర్ పరికరాల కంటే వేగంగా రీడింగ్ తీయడంతో పాటు క్షణాల్లో సమాచారం సర్వర్‌లో నిక్షిప్తమవుతుంది. ఈ విధానం విజయవంతం అయితే జూన్ నుంచి పూర్తి స్థాయిలో ఈ విధానం అమలులోకి రానుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో తొలుత గణపవరం, పెదపాడు, ఏలూరు నార్త్ సెక్షన్, పాలకొల్లు టౌన్, పాలకొల్లు రూరల్, భీమవరం టౌన్, తణుకు డీ1, డీ2, నిడదవోలు, కొవ్వూరు సెక్షన్ల పరిధిలో మార్చి నెల బిల్లులను తీసే ప్రక్రియను ప్రారంభించారు.

త్వరలో టెండర్లు

విద్యుత్ సంస్థకు సంబంధించి స్పాట్ బిల్లింగ్ టెండర్లు పిలిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో టెండర్లు దక్కించుకున్నవారి గడువు మార్చి 31తో ముగియనుండటంతో కొత్తగా టెండర్లు పిలిచేందుకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయ వర్గాలు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 6 డివిజన్లు, 23 సబ్ డివిజన్లు, 8 విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు ఉండగా 13 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిని బిల్లింగ్ చేసేందుకు 550 మంది మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. మొత్తం 600 స్పాట్ బిల్లింగ్ మెషీన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి నెలా 2 నుంచి 12వ తేదీ వరకు బిల్లింగ్ తీస్తున్నారు. 11 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసి వినియోగదారుడికి యూనిట్ల రేటు పెరగకుండా చూడాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 2023 నుంచి 2025 వరకు కాలపరిమితి ఉండేలా నూతన కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇకపై కొత్త కాంట్రాక్టర్లు మొబైల్ విద్యుత్ మీటర్ రీడింగ్ బిల్లింగ్ చేసేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. ఇందుకోసం కాంట్రాక్టర్లు మొబైల్ ఫోన్లు సమకూర్చుకుంటే అందుకు తగిన స్కానర్లు, ప్రింటర్లు సంస్థ సమకూర్చనుంది.

కొత్త విధానంలో ఇలా...

ఆండ్రాయిడ్ ఫోన్లకు మీటర్ రీడర్ పరికరాన్ని అమర్చుతారు. విద్యుత్ మీటర్‌ను స్కానింగ్ చేయగానే యూనిట్లను రికార్డు చేస్తుంది. ఈ విధానంలో బిల్లులకు సంబంధించి అవకతవకలకు ఆస్కారం ఉండదు. జియో ట్యాగింగ్ ఉండటంతో రీడర్ డోర్ లాక్ పేరుతో తప్పుదారి పట్టించే అవకాశం ఉండదు. మారుమూల ప్రాంతాల్లో సైతం ఇవి పనిచేసేలా రూపొందించారు. అంతేకాకుండా విద్యుత్ రెవెన్యూ సెక్షన్‌లో వీఆర్వోలు కంప్యూటర్ డేటాను అప్‌లోడ్, డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. ఒక్కో ఆండ్రాయిడ్ ఫోను డివైజ్‌లో లక్ష సర్వీసులను పొందుపరిచే వీలుంది. ఈ విధానంలో రీడింగ్ తీయగానే వినియోగదారుడికి సైతం మెసేజ్ రూపంలో సమాచారం వస్తుంది. గతంలో బిల్లింగ్ చేశాక దాన్ని అప్‌డేట్ చేయడానికి కొంత సమయం పట్టేది. రీడర్ ఆరోజు సాయంత్రం సంబంధిత ఏఈ కార్యాలయానికి వెళ్లి అక్కడ కంప్యూటర్‌లో సమాచారాన్ని పొందుపరచాలి. ఈ పరికరంలో నిక్షిప్తమయ్యే సమాచారం కూడా తక్కువగానే ఉంటుంది. ఈ ఇబ్బందులు లేకుండా స్మార్ట్‌ఫోనుతో రీడింగ్ తీస్తే క్షణాల్లో బిల్లు జనరేట్ అవుతుంది. బిల్లులో స్లాబ్ రేటు పెరగకుండా ఉండటంతోపాటు బిల్లులో హెచ్చుతగ్గులు వచ్చే అవకాశం ఉండదు.



నూతన విధానంలో ఫోన్ స్కానర్ ద్వారా విద్యుత్ బిల్లు తీస్తున్న రీడర్

నాణ్యమైన సేవలందించాలనే

మొబైల్ విద్యుత్ మీటర్ రీడింగ్ బిల్లింగ్ చేసే విధానం జిల్లాలో కొన్ని సెక్షన్ల పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టాం. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుగా కొత్త విధానంలో రీడింగ్ తీసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. త్వరలో నూతన స్పాట్ బిల్లింగ్ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఉమ్మడి జిల్లా ఏలూరు సర్కిల్ పరిధిలో అమలు చేస్తాం.

– సాల్మన్‌రాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఏలూరు సర్కిల్

ఇంటర్ పరీక్షలకు 95 శాతం హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రెండో రోజు నిర్వహించిన ఇంగ్లీష్–1 పరీక్షకు 106 కేంద్రాల్లో మొత్తం 34,483 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 11,609 మంది జనరల్ విద్యార్థులకు గాను 11,129 మంది హాజరు కాగా, 480 మంది గైర్హాజరయ్యారు. అలాగే 2,096 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 766 మంది హాజరు కాగా, 330 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 15,635 మంది జనరల్ విద్యార్థులకు గాను 15,113 మంది హాజరుకాగా, 522 మంది గైర్హాజరయ్యారు. 1770 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,535 మంది హాజరు కాగా 235 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4,280 మంది జనరల్ విద్యార్థులకు గాను 3,964 మంది హాజరు కాగా 93 మంది గైర్హాజరయ్యారు. అలాగే 906 ఒకేషనల్ విద్యార్థులకు గాను 789 మంది హాజరు కాగా 117 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మీద విద్యార్థుల హాజరు 95 శాతంగా నమోదైంది. ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు చెప్పారు.

జీడి అంటు మొక్కల సాగుతో అధిక దిగుబడి

జంగారెడ్డిగూడెం: శాస్త్రీయమైన విధానం ద్వారా జీడిమామిడి సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ అన్నారు. జంగారెడ్డిగూడెం రోటరీక్లబ్‌లో జీడిమామిడి సాగుపై జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. బాపట్ల జీడిమామిడి పరిశోధనా సంస్థ, వైఎస్సార్ హార్టీ కల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జానకిరామ్ మాట్లాడుతూ జీడిమామిడిలో ముదురు మొక్కలు, విత్తన మొక్కల స్థానంలో మేలైన జీడి అంటు మొక్కలు నాటుకోవాలన్నారు. శాస్త్రీయ విధానం అనుసరిస్తూ, ఆదర్శ రైతులు పాటిస్తున్న విధానాలను అవలంబించడం ద్వారా హెక్టారుకు అధిక ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. యూనివర్సిటీ రూపొందించిన మొక్కలను నాటడం ద్వారా అనుకున్న దిగుబడి సాధ్యమన్నారు. హెక్టారుకు 1,600 నుంచి 2 వేల కేజీల దిగుబడి సాధించేలా రైతులు సాగు పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ ఈ.కరుణశ్రీ మాట్లాడుతూ వైఎస్సార్ హార్టీకల్చర్ టెక్నాలజీని అవలంభించి వివిధ రకాల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా జీడిమామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా ఏడీహెచ్ శాంతి మాట్లాడుతూ జీడిమామిడి సాగు విస్తీర్ణంలో, ఉత్పత్తిలో జిల్లా ముందు వరుసలో ఉందన్నారు. బుట్టాయగూడెం ప్రాంతంలో ముదురు మొక్కలు స్థానంలో అంటు మొక్కలు నాటి పెంచుతున్నారన్నారు. జీడిమామిడి సాగులో ఆధునిక పద్ధతులను డాక్టర్ కె.ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.రెడ్డి, వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: భార్యను వేధిస్తున్న భర్తపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోడిగూడెంకు చెందిన కొండుబోయిన దుర్గాభవాని, అదే గ్రామానికి చెందిన కొండుబోయిన ఫణీంద్ర పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు మగపిల్లలు. కాగా చెడు వ్యసనాలకు లోనైన ఫణీంద్ర గత కొన్నాళ్లుగా మద్యం తాగి వచ్చి భార్యను కొడుతున్నాడు. అలాగే అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను సరిగ్గా చూడడం లేదు. దీనికి తోడు ఫణీంద్ర చర్యలను అతని పెద్దమామ కె.వెంకటేశ్వరరావు, చిన్నమామ కె.సత్యన్నారాయణ, బావ కె.అజయ్, కె.రాంబాబు సమర్థిస్తున్నారు. ఇదిలా ఉంటే తనను, పిల్లలను పట్టించుకోవడం లేదని అడిగినందుకు తన భర్త తనతో గొడవపెట్టుకుని, కత్తిపీట తీసి చంపుతానని బెదిరించినట్టు దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

25 కేజీల గంజాయి స్వాధీనం?

మొగల్తూరు: మొగల్తూరులో 25 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై అనుమానంగా సంచరిస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ సమక్షంలో నిందితులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

శ్రీవారి కొండపై అభివృద్ధి పరవళ్లు

- శరవేగంగా పనులు.. మారనున్న క్షేత్రం పరిసరాలు
- రూ.23 కోట్లతో అనివేటి మండప విస్తరణ
- శాశ్వత క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులు
- మారనున్న వాహనశాల, వీఐపీ లాంజ్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ క్షేత్రంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రూ.23 కోట్ల వ్యయంతో అనివేటి మండప విస్తరణ, శాశ్వత క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టింది. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణాలు పూర్తయితే క్షేత్ర రూపురేఖలు మారిపోనుండగా, భక్తులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. నిత్యం చినవెంకన్న క్షేత్రాన్ని 7 వేల నుంచి 15 వేల మంది భక్తులు సందర్శిస్తుంటారు. శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో ఈ సంఖ్య 30 నుంచి 50 వేల వరకు ఉంటుంది. ప్రస్తుతం ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో ఉన్న తాత్కాలిక వైకుంఠం క్యూకాంప్లెక్స్ భక్తులకు సౌకర్యవంతంగా ఉంది. దీనిని శాశ్వతంగా నిర్మించాలన్న సంకల్పంతో ఆలయ అధికారులు పాత ప్రసాదాల కౌంటర్ వెనుక భాగాన రూ.12.50 కోట్ల వ్యయంతో ఈ క్యూ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. అదేవిధంగా ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో గతంలో రూ.6.50 కోట్ల వ్యయంతో శిల్పకళ ఉట్టిపడేలా, అందరినీ ఆకట్టుకునే విధంగా 300 అడుగుల పొడవైన అనివేటి మండపాన్ని నిర్మించారు. భక్తులకు, అలాగే వివాహాది శుభకార్యాలు జరుపుకునే వారికి అది ఎంతో సౌకర్యంగా ఉంది. దీన్ని రూ.10.50 కోట్ల వ్యయంతో మరో 300 అడుగులు (జంట గోపురాల వరకు) విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి.

పలు విభాగాలు మార్పు

ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా పాత ప్రసాదాల కౌంటర్‌ను పొక్లెయిన్ సహాయంతో తొలగిస్తున్నారు. దీంతో ఈ భవనంలో ఉన్న స్వామివారి వాహనశాలను అనివేటి మండపంలోకి, అలాగే వీఐపీ లాంజ్‌ను శ్రీనివాస అతిథి గృహంలోకి, ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని బుకింగ్ కౌంటర్ల పక్కన క్యాంటిన్ నిమిత్తం నిర్మించిన భవనంలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి వాహనాలు భక్తులకు కనిపించేలా, వాటికి రక్షణ ఉండేలా అనివేటి మండపం చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే అనివేటి మండప విస్తరణ పనుల్లో భాగంగా తూర్పు ప్రాంతంలో ఉన్న అన్ని షాపులను పార్కింగ్ ప్రాంతంలోకి మార్చనున్నారు. ఈ క్రమంలో షాపుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.


శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణం కోసం యంత్రాలతో చేస్తున్న పనులు


పొక్లెయిన్‌తో పాత ప్రసాదాల కౌంటర్ కట్టడాన్ని తొలగిస్తున్న దృశ్యం


అనివేటి మండప విస్తరణలో భాగంగా జరుగుతున్న పనులు

సౌకర్యాలు మెరుగుపరచడమే లక్ష్యం



శ్రీవారి భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రస్తుతం క్షేత్రంలో అనివేటి మండప విస్తరణ, శాశ్వత క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు చేపట్టాం. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీ భాస్కర్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఆలయ పాలకవర్గ సభ్యుల సహకారంతో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తాం.

– వేండ్ర త్రినాథరావు, ఈఓ, శ్రీవారి దేవస్థానం

అకాల వర్షాలతో మామిడికి తెగుళ్ల ముప్పు

నూజివీడు: అకాల వర్షాల వల్ల మామిడిలో పక్షి కన్ను తెగులు వచ్చే అవకాశముందని నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.రాధారాణి అన్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని బోర్వంచ, రావిచర్లలో మామిడి తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పక్షి కన్ను తెగులును గమనించిన వెంటనే దీని నివారణకు సాఫ్ 2గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే తోటల్లో తేనెమంచు పురుగు, తామర పురుగు ఉధృతి ఉంటే వాటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏడీహెచ్ పీవీఎస్ రవికుమార్ మాట్లాడుతూ మామిడితోటలు లాభసాటిగా ఉండాలంటే సమగ్ర యాజమాన్యం ఎంతో అవసరమన్నారు. నూజివీడు ఉద్యాన అధికారిణి ఆర్.హేమ, ఉద్యాన సహాయకులు ప్రవీణ్, జయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల పట్ల మామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు మామిడి పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టు బొర్రా కనకమహాలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఒక సెంటీమీటర్ కంటే అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం మామిడి తోటలు పిందె, కోత దశల్లో ఉన్నాయని, వంద గ్రాముల కంటే బరువున్న పిందెలు ఈ వర్షం వల్ల సైజు పెరగడానికి అవకాశం ఉందన్నారు. అయితే పూత, కాయలున్న తోటల్లో కాయమచ్చ తెగులు, పూరెమ్మ మాడు తెగులు రావచ్చన్నారు. అలా వచ్చినట్లయితే ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా కార్బండిజమ్ 50 శాతం 1గ్రాము, మ్యాంకోజెబ్ 2.5 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. చిన్న పిందెలు, పూత దశల్లో ఉన్న తోటల్లో ఈ అకాల వర్షాలకు చిగురులు రావడానికి ఆస్కారం ఉందన్నారు. ఈదురు గాలుల వల్ల పెద్ద కాయలు రాలినట్లయితే వాటిని చెక్కు తీసి చిన్న ముక్కలు కోసి ఎండబెట్టి మామిడి పొడి చేసుకోవచ్చన్నారు. తోటల్లో రైతులు పైపాటు చేసుకొని కలుపు లేకుండా చూసుకోవాలని సూచించారు.


బోర్వంచలో మామిడి తోటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త రాధారాణి, పక్కన ఏడీహెచ్ రవికుమార్, హెచ్‌వో హేమ

సాంకేతిక నైపుణ్యంతోనే రాణింపు

తాడేపల్లిగూడెం: ప్రపంచదేశాలకు దీటుగా భారత్ ఆధునిక సాంకేతికతలో దూసుకెళుతోందని మహర్షి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వేదిక్ టెక్నాలజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఆమంచి కార్తీక్ అన్నారు. ప్రాచీన భారతదేశంలో అధునాతన సైన్సు అండ్ టెక్నాలజీస్ అనే అంశంపై ఏపీ నిట్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశానికి చెందిన ఎంతో మంది శాస్త్రవేత్తలు అహర్నిశలు శ్రమించి ఎన్నో ఆవిష్కరణలకు రూపకల్పనలు చేశారన్నారు. ఈ స్ఫూర్తితో విద్యార్థులు నూతన పరిశోధనలు చేపట్టాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త లక్ష్యాలను ఏర్పరచుకొని , వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. సృజనాత్మకత,ప్రతిభ కలిగిన విద్యార్థులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీన్‌లు జీఆర్‌కె.శాస్త్రి, ఎన్.జయరామ్, టి.కురుమయ్య, ఆచార్యులు వి.సందీప్, రమేష్, పి.శంకర్, కిరణ్‌తీపర్తిలు పాల్గొన్నారు.




ఏపీ నిట్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆమంచి కార్తీక్, కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

మత్స్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: బాదంపూడి మత్స్య శిక్షణా కేంద్రంలో 3 నెలల సర్టిఫికెట్టు కోర్సులో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్‌చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ లోగా 'మత్స్య శాఖ సహాయ సంచాలకులు, మత్స్య శిక్షణ కేంద్రం, బాదంపూడి, ఏలూరు జిల్లా' అనే చిరునామాకు దరఖాస్తులు పంపాలని కోరారు. మొత్తం 20 సీట్లు ఉన్నాయని, కోస్తా జిల్లాలలోని మత్స్యకారులు, యువకులు, జాలర్లు, సహకార సంఘాల సభ్యులు, చేపలు పెంపకంపై ఆసక్తి కలిగిన ఇతరులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రం కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. కనీసం ఐదో తరగతి చదివి ఉండాలని, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈపై బదిలీ వేటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఏలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను బదిలీ చేస్తూ ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈపీడీసీఎల్ దెందులూరు ఆపరేషన్ ఏఈగా పనిచేస్తున్న మల్లు రమేష్‌బాబు గత ఫిబ్రవరి నెలలో ఒక విద్యుత్ కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ సంఘటనలో రమేష్‌బాబును తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఏలూరు రూరల్ ఆపరేషన్ డీఈఈగా పనిచేస్తున్న పి.ఓంకారం పర్యవేక్షణ లోపంగా పరిగణించి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను నరసాపురం సీఅండ్ఓ విభాగం డిప్యూటీ ఈఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయనను తక్షణమే విధుల నుంచి విడుదల చేసి ఏలూరు రూరల్ స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ సాల్మన్‌రాజుకు సూచించారు. ఇదిలా ఉండగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్ల పరిధిలో కొంతమంది అధికారుల అవినీతి, అలసత్వంపై ఫిర్యాదులపై అందుతున్న నేపథ్యంలో త్వరలోనే పలువురు అధికారులను బదిలీ చేసే అవకాశం ఉందని విద్యుత్ ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది.

జాతరలో కొట్లాటపై కేసుల నమోదు

భీమవరం అర్బన్: మండలంలోని కరుకువాడ బేతపూడిలో అమ్మవార్ల జాతరలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట ఘటనపై కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ హెచ్‌సీ పి.మహేశ్వరరావు శుక్రవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బేతపూడి మహలక్ష్మణరావు, బేతపూడి వీరభద్రయ్యలకు అదే గ్రామానికి చెందిన నక్కా బాలాజీ, లోకం రామకృష్ణ, లోకం జయరామ్, లోకం నాగేంద్ర తేజలకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో గురువారం అమ్మవార్ల జాతరలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలతో కొట్లాటకు దిగారు. ఈ ఘటనపై ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో తణుకు విద్యార్థిని ప్రతిభ



తణుకు విద్యార్థిని కార్తిక ఉషశ్రీ దుర్గను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: బెంగుళూరులో జరిగిన 'జాతీయ స్థాయి యోగా పోటీల్లో తణుకు ఎస్ కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థిని కె కార్తిక ఉషశ్రీ దుర్గ ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినినీ కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఏవో డా. డీ సుబ్బారావు, యోగా డైరెక్టర్ జీ అబ్బులు చౌదరి, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత



ముత్యాలరావు కుటుంబసభ్యులకు నగదు అందిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌లు

పెంటపాడు: ఆపదలో ఉన్న వ్యక్తులను వైఎస్సార్ ప్రభుత్వం తప్పక ఆదుకొంటుందని పెంటపాడు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, కొవ్వూరి ప్రసాద్‌రెడ్డిలు పేర్కొన్నారు. కునాకరపేటలోని 3వ సచివాలయం పరిధిలోని జీలుగుమిల్లి ముత్యాలరావు ఈనెల 15న అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధితుని కుటుంబ సభ్యులను శుక్రవారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ తదితరులు పరామర్శించారు. ప్రభుత్వ సాయంగా రూ.10వేలు నగదును అందజేశారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా ఆ కుటుంబాన్ని ఆదుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ సీ సభ్యులు రెడ్డి సూరిబాబు, 8,10 వార్డు సభ్యులు అరుణ, మారంపూడి ఏసు, పార్టీ గ్రామ కార్యదర్శి చదలవాడ శ్రీను, యూత్ నాయకులు కర్రి పృథ్వీకుమార్‌రెడ్డి, సత్యమూర్తి, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత



కుంచనపల్లిలో క్రీడా పరికరాలు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ సింగం సుబ్బారావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సింగం సుబ్బారావు పుట్టిన రోజు వేడుక శుక్రవారం నిర్వహించారు. జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి, సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుంచనపల్లి యూత్ సభ్యులకు వాలీబాల్, నెట్ బాల్ క్రికెట్ కిట్లను సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చిన్నం సురేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోకన్వీనర్ ఉర్ల నవీన్, మామిళ్ళపల్లి మహేష్, ఉసురుమర్తి చంటి, మానుకొండ రాజేష్, వర్ధనపు నవీన్, తాడేపల్లి శేఖర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్తను జేసీబీ సాయంతో శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ గొర్రెల వెంకట కోటేశ్వరరావు

పెంటపాడు: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామ ప్రజలు స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల వెంకట కోటేశ్వరరావు పేర్కొన్నారు. గత రెండు రోజులు నుంచి గ్రామంలోని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ ప్రజలకు ఇబ్బందులు లేకుండా జెసీబీ సాయంతో చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండలరాయుడికి విశేష పూజలు

అత్తిలి: స్థానిక గంటావారిపుంతలో కొలువై ఉన్న కొండలరాయుడు ఆలయంలో శుక్రవారం అభిషేక, హోమ పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ గురువు గొట్టుముక్కల సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చల్లపల్లి సుబ్బయ్యశాస్త్రి పూజాధికాలను జరిపారు.

స్త్రీ నిధి.. మహిళలకు పెన్నిధి

- స్త్రీ నిధి రుణాలతో స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు
- చిరు వ్యాపారాలకు ఆర్థిక తోడ్పాటు



సమావేశంలో చర్చించుకుంటున్న మహిళలు (ఫైల్)

పెంటపాడు: మహిళల అభివృద్ధే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోంది. గతంలో మహిళలు చిరువ్యాపారం నిర్వహించుకోవాలంటే ప్రైవేటు బ్యాంకుల వారిని ఆశ్రయించేవారు. వీరు సూక్ష్మ రుణాల పేరిట అధికవడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను అడ్డంగా దోచుకొనేవారు. వాటిని తప్పించడం కోసం మహిళల కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్త్రీ నిధి బ్యాంకులను ఏర్పాటు చేసింది. ఆ పథకం డ్వాక్రా మహిళలకు వరంగా మారింది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు పొదుపు చేస్తూనే మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం కల్పించిన స్త్రీ నిధి ద్వారా మహిళలు రుణం పొంది కిరాణా, ఫ్యాన్సీ, టైలరింగ్, గొర్రెల పెంపకం, పాడిగేదల పెంపకం, తినుబండారాల దుకాణం, చిన్నపాటి వ్యాపారాలు పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. వీరు స్త్రీ నిధి ద్వారా ఒక్కొక్క పొదుపు సంఘంలోని సభ్యులకు రూ. 50 వేలు నుంచి రూ.1 లక్ష వరకు మంజూరు పొందవచ్చు. ఈ రుణంతో మహిళలు తమకు ఆశక్తి ఉన్న రంగాల్లో యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు. దీంతో మహిళలు స్వయం ఉపాధిని పొందడంతో పాటు, వారి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. మండలంలో 1,541 స్వయం సహాయక గ్రూపులు ఉండగా ఒక్కో సంఘానికి 4 లక్షల చొప్పున స్త్రీ నిధి ద్వారా 782 సంఘాలకు రుణం మంజూరు చేశారు. దీని ద్వారా 3,955 మందికి 17 కోట్లు 89 లక్షల రుణం అందింది. కాగా రికవరీ శాతం కూడా నూరుశాతం జమ అవుతోంది. దీంతో పాటు మండలంలోని వైఎస్సార్ ఆసరా ద్వారా 1,345 సంఘాలు అర్హత సాధించాయి. ఇప్పటివరకు ఆసరా రుణం కింద రెండు విడతలుగా రూ.25.80 కోట్ల సొమ్ము పొదుపు సంఘాల ఖాతాల్లో జమైంది. తద్వారా ఆసరా పథకం వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడింది.

స్త్రీ నిధి రుణంతో ఉపాధి పొందుతున్నా



మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వం అందించిన స్త్రీ నిధి పథకం ద్వారా రూ. 50 వేల రుణం తీసుకొని కిరాణాషాపు నిర్వహిస్తున్నాను. దీనితో ఉపాధి పొందుతూ నా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాను. స్త్రీ నిధి పథకం నా ఉపాధికి ఎంతో ఉపయోగపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

– దేవ రామసీత, రామసీత గ్రూపు, రావిపాడు

వ్యాపార అభివృద్ధికి తోడ్పడింది



స్త్రీ నిధి పథకం మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తోడ్పడింది. ఈ పథకం ద్వారా రూ. 50 వేలతో గాజులు, ఫ్యాన్సీ దుకాణం నిర్వహించుకొంటున్నాను. తద్వారా ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందుతూ నా కుటుంబానికి అండగా నిలుస్తున్నాను.

– కేదారి పావని, రాజరాజేశ్వరి గ్రూపు, పెంటపాడు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



స్వయం సహాయ సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అందజేస్తోంది. ఈ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా పొదుపు పాటించి పొందిన రుణాలను సకాలంలో చెల్లించే విధంగా కృషిచేయాలి.

– కె. లక్ష్మి, ఏపీఎం ఇన్‌చార్జి, పెంటపాడు

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌కు అభినందనలు



తణుకులో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను కలసి అభినందనలు తెలుపుతున్న తణుకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు



ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న గూడెం లయన్స్‌క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందిన తణుకు పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్‌ను జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలతో పాటు ప్రముఖులు అభినందనలు తెలిపారు. శుక్రవారం తేతలిలోని ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీ, తణుకు జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ఎంపీపీ రుద్రా ధనరాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయలతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులతో పాటు మండలంలోని ఎంపీటీసీ సభ్యులు,ఇరగరవం, అత్తిలి, పోడూరు, ఉంగుటూరు, మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, లయన్స్ క్లబ్‌ల నాయకులు వంకా రవీంద్రనాథ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సభ్యులు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్, ఎంఎల్‌సిగా విజయం సాధించిన వంకా రవీంద్రనాథ్‌ను తణుకులో శుక్రవారం ఆయన నివాసం వద్ద సత్కరించారు. ఈ సత్కారంలో జిల్లా మొదటి గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గమిని సుబ్బారావు, బుద్దాల వెంకట రామారావు, వట్టిప్రోలు రాము, నూకల నాగ మల్లేశ్వరరావు, పాలకొల్లు సభ్యులు కొమ్ముల మురళీకృష్ణ, ఆవినాష్‌రాజు, పాపరావు తదితరులు ఉన్నారు.

శశిలో అట్టహాసంగా అన్వేషణ టెక్‌ఫెస్ట్



మాట్లాడుతున్న సినీనటుడు సత్యదేవ్

తాడేపల్లిగూడెం: శశి ఇంజనీరింగ్ కళాశాలలో అన్వేషణ జాతీయ సాంకేతిక ,సాంస్కృతిక ఫెస్టు 2023 అట్టహాసంగా శుక్రవారం ప్రారంభమైంది. విద్యార్థులు జోష్ మధ్య, ఆహుతుల, ఆహ్వానితుల కోలాహలంతో విద్యార్థులు సాంస్కృతిక సంబరాలను ఆస్వాదించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు శశి అన్వేషణ ద్వారా తమ ప్రతిభను సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో ప్రదర్శించి నైపుణ్యం పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ శశి అన్వేషణ ఫెస్టులో 3800 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. శశి టెక్‌ఫెస్టుకు విశేష అతిధిగా హాజరైన సినీనటుడు (ఆచార్య ఫేం) సత్యదేవ్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సవర్టు కంపెనీ సీఈఓ సంకర్స్ చంద్ , అన్వేషణ కో ఆర్డినేటర్ డా.టి.సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్‌లో కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి



తణుకులో ఏపీసీడ్స్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తణుకు: ఏపీ సీడ్స్ కార్మికుల పొట్టకొట్టే టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏపీసీడ్స్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా కార్మికులు ఏపీ సీడ్స్ సంస్థలో హమాలీలు పని చేస్తున్నారని అయితే టెండర్ విధానంపై కార్మికులకు చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నట్లు చెప్పారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ టి.రామకృష్ణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గుబ్బల గోపి, యూనియన్ కార్యదర్శి గాది త్రిమూర్తులు, సాంబశివరావు, శ్రీహరి, వెంకటరమణ, సూరిబాబు, నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోరమండల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మెగా మెడికల్ ఉచిత వైద్య శిబిరం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్‌షెడ్డు వద్ద కార్మికులకు మెగా మెడికల్ వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఏపీ ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇంటస్ట్రీస్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వై.నాగరాజు, రైల్వే ఛీఫ్ కమర్షియల్ సూపరింటెండెంట్ బి.భాస్కరరావు, కోరమండల్ రీజినల్ లాజిస్టిక్ మేనేజర్ పి.ప్రదీప్ కుమార్, వేర్ హౌస్ మేనేజర్ కే.అప్పారావు, రైల్వే గూడ్స్‌షెడ్డు వర్కర్స్ యూనియన్ నాయకులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగరావు, ఈతకోట చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల గుండెల్లో గుబులు



తాడేపల్లిగూడెం మండలంలో కోతకు సిద్ధమైన వరి చేను

తాడేపల్లిగూడెం రూరల్: వాతావరణ మార్పులతో రానున్న 48 గంటల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో తాడేపల్లిగూడెం మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే శుక్రవారం ఉదయం మండలంలో ఒక మోస్తారు వర్షం కురిసింది. దీంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే దాదాపు 12వేలు హైబడి హెక్టార్లలో వరి పంట సాగవుతుంది. ప్రస్తుతం పీఆర్‌పీ, ఎస్ఎల్-10 వంటి రకాలు కోతకు వస్తున్నాయి. మరో వారం, పది రోజులు వాతావరణం అనుకూలిస్తే పంట చేతికొస్తుందని రైతు దెయ్యం సత్యనారాయణ తెలిపారు. ఈ పదిహేను రోజులు వాతావరణం అనుకూలిస్తే రైతుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, లేకుంటే ధాన్యం తడిసి రంగు మారే అవకాశం ఉందని వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హౌసింగ్‌బోర్డు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ రిలయన్స్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 18వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. సత్యవతినగర్ చెట్లు రోడ్డులో మరమ్మతులు జరుగుతాయని, పరిసర ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్‌బీకేల్లో ఈ-పంట నమోదు జాబితా

ఇరగవరం: మండలంలో ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తయిందని, రైతుల పేర్లతో జాబితా తయారు చేసి రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు తెలిపారు. రైతులు జాబితాలు పరిశీలించి, వారి పేర్లు లేనట్టయితే వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయశాఖ అందించే అన్ని రాయితీలకు ధాన్యం అమ్మకానికి, పంట నష్టంలో కూడా ఈ-పంట నమోదు తప్పనిసరి అన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ వినియోగించుకోండి

తాడేపల్లిగూడెం: చెల్లించాల్సిన పన్నులు, పన్ను బకాయిలు వెంటనే చెల్లించి వడ్డీ రాయితీని వినియోగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ బి.బాలస్వామి ఒక ప్రకటనలో కోరారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు 34 ప్రకారం చెల్లించాల్సిన పన్నులు ఏకమొత్తంగా చెల్లించి రాయితీ పొందాలన్నారు. మార్చి 31లోగా ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికే ఈ రాయితీ లభిస్తుందన్నారు.

ఘనంగా ప్రారంభమైన కనకదుర్గమ్మ జాతర



కొండేపాడులో జాతర ఉత్సవాలకు ముస్తాబైన కనకదుర్గమ్మ అమ్మవారు

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడులో గ్రామదేవత కనకదుర్గమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అమ్మవారి జాతర సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని ముస్తాబు చేసారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, డప్పులు, గరగలతో అమ్మవారిని రాత్రింతా ఊరేగించారు. ఆలయ ఈవో శోభనాద్రి, ధర్మకర్తలు తల్లాప్రగడ వంశీయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. సర్పంచ్ కట్టా దానయ్య, ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు తదితరులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్పీటీసీ పాలా గణపతి, కోరుమిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు దారుణం



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: త్రిపురలో కార్మికవర్గంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న దాడులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. స్థానిక వైజంక్షన్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు రావడంతోనే బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడులు చేయడం దారుణమన్నారు. నేటికీ త్రిపురలో ప్రజాస్వామ్యం నాశనం చేసి నియంతృత్వ పద్ధతులకు పాల్పడుతోందని అన్నారు. కార్మిక, ప్రతిపక్షాల ఇళ్లు, కార్యాలయాలు తగలబెడుతున్నప్పటికీ కేంద్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి గుబ్బల గోపి, టి.రామకృష్ణ, శ్రీహరి, కృష్ణ, రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



తణుకులో ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డీఎం సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి తెలిపారు. తణుకు ఆర్టీసీ డిపో నుంచి ఏలూరు, గణపవరం రూట్లలో ప్రయాణించే బస్సుల్లో ప్రయాణాలకు సంబంధించి శుక్రవారం డ్రాలు తీసి విజేతలకు బహుమతులు అందచేశారు. షాలేమ్ పెన్ కార్నర్ అధినేత అమర్‌నాథ్ సౌజన్యంతో సమకూర్చిన బహుమతులను డిపో మేనేజరు చేతులమీదుగా ప్రయాణికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇనస్పెక్టర్ బీవీకే రావు, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలోనే లక్ష్యం నిర్దేశించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతిలో ఉండగానే విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పాతూరు 12వ వార్డు సంజీవనగర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగేంద్ర, టి.రవిబాబులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ వృత్తిని ఎంచుకోవాలనుకుంటున్నామో దానికి అనుగుణంగా ఇప్పటి నుంచి అడుగులు వేయాలని సూచించారు. పదోతరగతి పరీక్షలను బాగా రాసి మంచి ఫలితాలతో పాటు పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

నేత్రాలను పరిరక్షించుకోవాలి

తాడేపల్లిగూడెం: ప్రతీ ఒక్కరూ తమ నేత్రాలను పరిరక్షించుకోవాలని జి.ఆర్.రెడ్డి కంటి ఆసుపత్రి నేత్రవైద్యులు జి.ఆర్.రెడ్డి అన్నారు. ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రెడ్డి మాట్లాడుతూ గ్లకోమా అనేది ఆప్టిక్ నరాలకి హాని కలిగించేదన్నారు. ఆప్టిక్ నరాలు దెబ్బతినడం వల్ల అంధత్వం ఏర్పడవచ్చన్నారు. అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. త్రీఎఫ్ ఎండీ ఓపి.గోయంకా, చాంబర్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, బుద్దాల రామారావు పాల్గొన్నారు.

కనుల పండువగా మల్లేశ్వరస్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. చిట్టూరి ఇంద్రయ్య - కాంచనమాల, ముళ్లపూడి రామకృష్ణ - పద్మావతి దంపతులు పీఠలపై కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ సేవకులు నూజెళ్ళ రాజు, వరంగల్ రాంపండు, మల్లిపూడి రాంబాబు, కాశీ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మ అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బలుసులమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అనంతరం దాతలు సహాయ సహకారాలతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు కొట్టు అంజిబాబు, పెదప్రోలు భాస్కరరావు, వట్టిపోలు రాము తదితరులు పర్యవేక్షించారు.

ఎల్.అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజీషియన్



ఎల్.అగ్రహారం గ్రామంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీహర్ష

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీహర్ష, 108 వాహన సేవల డాక్టర్ పవన్ వర్మలు రోగులకు బీపీ, జనరల్ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే ఇంటి వద్ద వైద్యం పొందుతున్న వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు డి.ఇందిరాప్రియాంక, క్లస్టర్ ఎంపీహెచ్ఎ ఆర్.రాధాకృష్ణ, ఏఎన్ఎం డిఎస్.గంగాదేవి, డీఈవోలు రత్నం, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.